క్లుప్తంగా

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

మాడుగులపల్లి : మండలంలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జమీరొద్దీన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 2020 నవంబర్‌లోపు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు దరఖాస్తుకు అర్హులని తెలిపారు. అర్హులు వచ్చే నెల 6వ తేదీలోపు ఫారం–18 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. త్వరలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక ఉన్నందున పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

మిర్యాలగూడ : పట్టణంలోని నందిపాడు బేతేలు న్యూ లైఫ్ చర్చిలో మిర్యాలగూడ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా రెవా పేరం ఇమాన్యుయేల్, ఉపాధ్యక్షుడిగా ఎలిషా పెరుమాళ్ల, కార్యదర్శిగా బట్టగాని సంజీవరావు, సహాయ కార్యదర్శిగా దుగ్గి బెంజిమన్‌లతోపాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముళ్లగిరి కాంతయ్య, కాశమల్ల విక్టర్, చిలుక విద్యాసాగర్, పెయ్యల ప్రసాద్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పట్టణంలో స్వరాజ్ మైదానంలో శుక్రవారం ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సామాజిక కార్యకర్త, దళిత రత్న అవార్డు గ్రహీత యేకుల సురేష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : ఈనెల 22న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించే నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం సందర్భంగా పట్టణంలో బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ నల్లగొండ బాలుర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (2024–25) బైపీసీ, ఎంపీసీ గ్రూప్‌లలో ప్రవేశానికి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఎండి. మునీరుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9391771159 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

నల్లగొండ : పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల 2024 సంవత్సరం టేబుల్ క్యాలెండర్‌ను గురువారం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎస్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రెడ్డి, ఏపాల సత్యనారాయణరెడ్డి, కొప్పు రాంబాబు, కె.నరేందర్‌రెడ్డి, కె.బాలరాజ్‌రెడ్డి, యాకుబ్ నాయక్ పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష విడనాడాలి

దేవరకొండ : మహిళలపై వివక్ష విడనాడి వారిని చదువులో ప్రోత్సహించాలని మర్రిచెట్టు గ్రామ సర్పంచ్ శ్రీనునాయక్ అన్నారు. దేవరకొండ మండలంలోని మర్రిచెట్టుతండాలో గురువారం సీడబ్ల్యూసీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసిఐ సంస్థ సిబ్బంది, వార్డు సభ్యులు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం.. భవితకు మార్గం

- మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు పెరుగుతున్న పోటీ
- ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష
- 6 నుంచి 10 తరగతిలో ప్రవేశాలకు అవకాశం

హాలియా : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఆదర్శ పాఠశాలల ద్వారా గ్రామీణ విద్యార్థులను ఇంగ్లీష్ మీడియంలో తీర్చిదిద్దుతున్నారు. ఇందు కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించి పాఠశాలల్లో చేర్చుకుంటున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. ఇక తెలంగాణ మోడల్ స్కూళ్లలో 2024–2025 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్లను కూడా భర్తీని ప్రవేశ పరీక్ష ద్వారా చేపట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన అందించేందుకు ప్రభుత్వం 2013లో మోడల్ స్కూళ్లు (ఆదర్శ పాఠశాలలు) నెలకొల్పింది. జిల్లా వ్యాప్తంగా 17 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో ప్రతి సంవత్సరం ఆరో తరగతిలో వంద మందికి ప్రవేశం కల్పిస్తారు. టీఎస్ఎంఎస్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు కొనసాగుతాయి.

దరఖాస్తులు ఇలా..

ఆరో తరగతితో పాటు ఇతర తరగతుల్లో అడ్మిషన్ల కోసం ఫిబ్రవరి 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు కేవలం ఆన్‌లైన్ వెబ్ సైట్ http:||telanganaMS.cgg.gov.in మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు కోసం ప్రస్తుతం వారు చదువుతున్న పాఠశాల నుంచి బోనోఫైడ్, ఆధార్‌కార్డు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మీ సేవ కేంద్రంలో గానీ, ఇంటర్నెట్ సెంటర్‌లో గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ఫిబ్రవరి 22వ తేదీ తుది గడువు. వివరాలు నమోదు అనంతరం దరఖాస్తు పత్రాలను ఆదర్శ పాఠశాలల్లోని ప్రిన్స్‌పాల్‌కు అందజేయాలి. ఏప్రిల్ ఒకటో తేదీలోగా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏప్రిల్ 7న జిల్లా కేంద్రమైన నల్లగొండలో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు,7 నుంచి 10వ తరగతిలో చేరే విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. రాత పరీక్ష తెలుగు, ఇంగ్లీష్‌లో జరుగుతుంది. 100 మార్కులకు సమాధానాలు రాల్సి ఉంటుంది. 6వ తరగతికి ఒక్కో పాఠశాలలో 100 మంది విద్యార్థులకు ప్రవేశం ఉంటుంది. దీంతో పాటు 7వ తరగతి నుంచి 10వ తరగతిలో మధ్యలో వివిధ కారణాలతో మానివేసిన ఖాళీ సీట్ల ప్రవేశం కోసం అవకాశం ఉంటుంది.


త్రిపురారం ఆదర్శ పాఠశాల

సద్వినియోగం చేసుకోవాలి



ఇప్పటికే ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఫిబ్రవరి 22వ తేదీ తుదిగడువు. అన్ని సదుపాయాలతో కూడిన ఆదర్శ పాఠశాలల్లో చక్కటి విద్య లభిస్తుంది. ఇంగ్లీష్ మీడియం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంలాంటిది. నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనతో విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం చక్కటి సహకారం అందిస్తుంది. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– బూరుగు నిర్మల ప్రిన్సిపాల్, త్రిపురారం మోడల్ స్కూల్

ప్రత్యేకతలివే..

- ఎటువంటి రుసుం లేకుండా ఆంగ్ల మాధ్యమంలో ఉత్తమ విద్యాబోధన.
- పక్కా భవనంతో తరగతి గదులు
- నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం.
- ఉచితంగా ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేస్తుంది.
- 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలకు ప్రతిభ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ.
- సైన్స్, కంప్యూటర్, ల్యాబ్‌తో పాటు లైబ్రరీ సదుపాయం.
- 10వ తరగతి విద్యార్థులకు ఎన్‌టీఎస్‌ఎకు ప్రత్యేక శిక్షణ తరగతులు వంటి సదుపాయాలు ఉన్నాయి.

ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి


మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

మిర్యాలగూడ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇటీవల ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అయితే దరఖాస్తు స్వీకరణ అనంతరం దరఖాస్తుల ఆన్‌లైన్ డేటా ఎంట్రీని ఈనెల 17వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించగా మిర్యాలగూడలో ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆర్డీఓ చెన్నయ్య తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో 30, 885 మిర్యాలగూడ గ్రామీణ ప్రాంతంలో 23,378, వేములపల్లిలో 9455, దామరచర్లలో 16,882, మాడ్గులపల్లిలో 6915, అడవిదేవులపల్లిలో 6284 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఈనెల 20, 21న ఓటర్ల జాబితా సవరణకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటరు తమ అడ్రస్ మార్పులు, ఓటు ట్రాన్స్‌ఫర్ తదితర అంశాలను మార్పు చేసుకోవడానికి ఫాం–8 ద్వారా స్థానిక బీఎల్‌ఓల వద్ద ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను అందించవచ్చని తెలిపారు.

అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అమరవీరుల స్ఫూర్తితో యువకులు ముందుకు కదలాలని పలువురు నాయకులు అన్నారు. చింతలపాలెంలో 1946 డిసెంబర్ 1న నైజాం సైన్యం చేసిన దాడిలో వీరమరణం పొందిన మహిళలు పేరుపంగు బూషమ్మ, పేరుపంగు తిరుపతమ్మ, అలుగుల వీరమ్మ సంస్మరణ సభ గురువారం చింతలపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులను స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహాత్మ్యం, మాజీ సర్పంచ్ సుందర మల్లేశ్వర్‌రెడ్డి, నాయకులు మోర్తాల నాగిరెడ్డి, షేక్ దస్తగిరి, మోర్తాల వెంకటరెడ్డి, పంతులు జానిమియా, పుల్లయ్య, భూలక్ష్మి, కొండలు, కోటయ్య, భూషణం, శ్రీను, జగదీష్, స్వామి, శ్రీరాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా మల్లికార్జున్



త్రిపురారం : బీజేపీ త్రిపురారం మండల కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన కటకం మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి జిల్లా కేంద్రంలో కటకం మల్లికార్జున్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంకణాల నివేదితారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మండల నాయకులు , కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

డీలర్లు సమయపాలన పాటించాలి


నిడమనూరు : రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణయ్య


వేములపల్లి : రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ

నిడమనూరు : ప్రభుత్వ చౌక దుకాణాల డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ కృష్ణయ్య గురువారం అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మండలంలోని రేషన్ డీలర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. అసలైన డీలర్లకు బదులుగా వారి భర్తలు హాజరుకావడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ అసలైన డీలర్లనే పిలిపించారు. ప్రతీ సమావేశానికి అసలైన రేషన్ డీలర్లే హాజరుకావాలని, రానివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసమావేశంలో రెవెన్యూ అధికారులు రషీద్, సందీప్, వంశీ, డీలర్లు నాగేశ్వరరావు, రవి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి : రేషన్ డీలర్లు సమయపాలన పాటించి లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలర్లు పారదర్శకంగా వ్యవహరిస్తూ బియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలన్నారు. రేషన్‌కార్డులో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మలాదేవి, ఆర్ఐలు మహేందర్‌రెడ్డి, స్పందనరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ జైపాల్‌రెడ్డి, రేషన్‌డీలర్లు సుధాకర్‌రెడ్డి, వెంకటయ్య, సతీష్‌రెడ్డి, కృష్ణమూర్తి, పాండురంగయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నందమూరి తారకరామారావుకు నివాళి


మిర్యాలగూడ : ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


మిర్యాలగూడ : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : బడుగు బలహీనవర్గాలకు ఎన్టీఆర్ చేసిన కృషి గొప్పదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పలు పార్టీల, సంఘాల నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం కమ్మసంఘం ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సీడీ.రవికుమార్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నెల్లూరు దుర్గాప్రసాద్, మట్టయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాధినేని శ్రీనివాస్‌రావు, నాయకులు సత్యనారాయణ, ప్రసాద్‌రావు, అరుణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, చలపతిరావు, శ్రీనివాస రావు రాములుయాదవ్, రాములుగౌడ్, రామలింగయాదవ్, వెంకన్న, మాన్యనాయక్, సైదానాయక్, తిరందాసు, విష్ణు, లక్ష్మీనారాయణ, రామావతారం, నసీరొద్దీన్‌బాబా, వెంకన్న, గోపాలకృష్ణ, కాశయ్య, శ్రీనివాస్, కృష్ణ, శ్రీనివాస్‌రావు, రమేష్, రచ్చ రమేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో..

బడుగు, బలహీనవర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడంలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చేసిన కృషి ఎనలేనిదని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాములుగౌడ్, లక్ష్మీనారాయణ, అరుణ్‌కుమార్, గోపాలకృష్ణ, రామావతారం, గంగాధర్, సాధినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిడమనూరు : నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా నిడమనూరులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మువ్వ అరుణ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతయ్య, నరసింహారెడ్డి, సైదయ్య, వెంకన్న, సత్యనారాయణ, నర్సింహారావు, రామస్వామి, ప్రణయ్, మమేష్, సీతయ్య సాయిబాబా ఉన్నారు.


నిడమనూరు : నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

వేములపల్లి : మండల కేంద్రంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర నాయకుడు జడ రాములుయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ.జానిమియా, వేములపల్లి, మాడ్గులపల్లి మండలపార్టీ అధ్యక్షులు జయరాంచారి, షేక్ రసూల్, గుండెబోయిన మల్లయ్య, దైదరాజు, అనంతరెడ్డి, రమేష్, మల్లేష్, సైదులు, సాంబయ్య, నాగయ్య, శంకర్, బాలకృష్ణ, వెంకన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరిన ఎమ్మెల్యే బాలునాయక్


డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : నియోజకవర్గ అభివృద్ధికి, ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరినట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎంను ఎమ్మెల్యే కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే వెంట దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ ఉన్నారు.

ఏటీఎంను వినియోగంలోకి తేవాలి


నిరుపయోగంగా ఉన్న ఏటీఎం

నాగార్జునసాగర్ : పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని పైలాన్‌లో జెన్‌కో కార్యాలయం వద్ద గల ఎస్‌బీఐ ఏటీఎంను వినియోగంలోకి తేవాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురికావడంతో ఏటీఎం గది అద్దాలు పగిలిపోయాయి. ఏటీఎం మిషన్ కాలిపోయింది. దీంతో నాటి నుంచి ఏటీఎంను మూసివేశారు. నిత్యం పర్యాటకుల రాకపోకలు ఉండటంతో పాటు మల్లెపల్లి నుంచి నాగార్జునసాగర్ వరకు ఎక్కడా ఎస్‌బీఐ ఏటీఎం లేదు. నగదు అవసరమైన వారు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపాలిటీలో కేవలం బ్యాంకు దగ్గర మాత్రమే ఏటీఎం ఉంది. ఏ రోజుకారోజే అందులో పెట్టిన నగదు అయిపోతుంది. సంబంధిత బ్యాంకు అధికారులు స్పందించి స్థానికుల, పర్యాటకుల అవసరాల మేరకు ఏటీఎం మరమ్మతులు చేయించాలని దీనితో పాటు బైపాస్ రోడ్డు వెంట మరో ఏటీఎంను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

హాలియా : జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు హాలియా పట్టణంలోని వీఎస్ఆర్ స్కూల్‌కు చెందిన విద్యార్థి అఫ్షా ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ శివర్ల వెంకటయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జనగామ ధర్మకంచ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్–14 బాలుర కబడ్డీ విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి అఫ్షా పాల్గొని క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి అఫ్షాను పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు అభినందించారు.

రేపాల సత్యనారాయణకు నివాళి

నల్లగొండటౌన్: సాయుధ పోరాట యోధుడు రేపాల సత్యనారాయణ సంస్మరణ సభ గురువారం నల్లగొండ పట్టణంలోని పోలీస్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరైసత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలయాల్లో స్వచ్ఛత పాటించాలి


ఆలయంలో శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: ఆలయాల్లో స్వచ్ఛత పాటించాలని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు గురువారం నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీ శ్రీ భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వచ్ఛ దేవాలయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు ప్రసాద్ మాట్లాడుతూ శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కంకణాల నాగిరెడ్డి, రావెళ్ల కాశమ్మ, కూతురు విజయ, దాయం భూపాల్‌రెడ్డి, మేడం భాస్కర్, రావిరాల వెంకట్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ములేస్తున్న డిండి బస్టాండ్


కంకర తేలి అధ్వానంగా ఉన్న బస్టాండ్ ఆవరణ

డిండి : హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే జాతీయ రోడ్డు మార్గమధ్యలోని డిండి బస్టాండ్ ఆవరణలోని మట్టి రోడ్డు కంకర రాళ్లు తేలడంతో బస్సులు ప్రయాణిస్తున్న సమయంలో దుమ్ము లేస్తోంది. దీంతో ఈ బస్టాండు గుండా ప్రతినిత్యం కొన్ని వేల సంఖ్యలో ప్రయాణించే ప్రయాణికులు రోగాల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండు ఆవరణలో సీసీ రోడ్డు నిర్మించాలని పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండలవాసులు వాపోతున్నారు.

ఆకట్టుకున్న పోస్టల్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్


ప్రదర్శనను తిలకిస్తున్న పాఠశాల విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ గురువారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రారంభమైంది. ఇందులో 1946 రకాల పోస్టల్ స్టాంపులను ప్రదర్శించారు. అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఎగ్జిబిషన్ పరిశీలించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 1000 మందికి పైగా విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను తిలకించారు.ఈ కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ కె.రఘునాథస్వామి, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మౌంట్ లిటరా జీ స్కూల్ ప్రిన్సిపాల్ తార, అసిస్టెంట్ సూపరింటెండెంట్ భూమయ్య, ఇన్‌స్పెక్టర్లు రవి, బుచ్చిబాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : రామకృష్ణ, వివేకానంద భావప్రచార పరిషత్ సమావేశాలను విజయవంతం చేయాలని స్థానిక రామకృష్ణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు గజ్జి ప్రభాకర్, దేవులపల్లి సుబ్రహ్మణ్య శర్మ కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో జనవరి 20న ఉదయం విద్యార్థుల సదస్సు, సాయంత్రం యువజన సదస్సు ఉంటుందని అన్నారు. 22న ఆదివారం ఉదయం ఉపాధ్యాయ సదస్సు, సాయంత్రం తల్లిదండ్రుల సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులకు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు వి.నాగేశ్వరరావు, కె.నందయ్య, అనిల్‌కుమార్, ఉపేందర్ రెడ్డి, రాఘవరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డ నర్సయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : అమరజీవి దొడ్డ నర్సయ్య స్ఫూర్తితో ఉద్యమాలు చేద్దామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అమరవరంలో ఆ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దొడ్డ నర్సయ్య 25వ వర్ధంతి కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నర్సయ్య హుజూర్‌నగర్ శాసనసభ్యుడిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని సేవ చేయడంతో పాటు అనేక మంది నిరుపేదలకు భూములు పంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలో నిర్వహించనున్న వర్ధంతి సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ కందుల వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి, ఉపేందర్, లక్ష్మయ్య, రాంరెడ్డి, కృష్ణయ్య, సుందరయ్య, వీరస్వామి, లక్ష్మయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.